విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

బుక్స్ అందజేస్తున్న ఎంఎల్ఎ

నరసాపురం: ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని విద్యార్థుల మధ్య ఆహ్లాదకరంగా గడిపారు. గురువారం నరసాపురం స్టేషన్‌పేటలోని గురుకుల పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేయడం ద్వారా ఆప్యాయతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా కట్టుబడి ఉందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

రుణాల కోసం నిరీక్షణ..!

ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాలపై తొండాట

ఏడాదిన్నర గడిచినా ఒక్క రుణమూ ఇవ్వని దుస్థితి

గత ప్రభుత్వం రుణాలు ఇవ్వకపోవడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి అర్థాంతరంగా మధ్యలో నిలిపివేత

బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు రెండు జిల్లాల్లో 40 వేల దరఖాస్తులు

ఎస్‌సి కార్పొరేషన్ రుణాల దరఖాస్తులు రెండు వేలు పైనే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాల మంజూరుపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసిపి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించిన కూటమి ఇప్పుడు అదేబాటలో నడుస్తోంది. కూటమి సర్కార్ వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ కార్పొరేషన్ రుణాలు ఒక్కటీ ఇవ్వకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించి మధ్యలో అర్థాంతరంగా నిలిపివేసిన ప్రభుత్వం.. మళ్లీ ఆ ఊసే మరిచిపోయింది. దీంతో వైసిపి ప్రభుత్వ బాటలోనే కూటమి సర్కార్ నడుస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాలపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. కార్పొరేషన్ రుణాలు మంజూరైతే ఉపాధి దొరుకుతుందని ఆశించిన ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ నిరుద్యోగ యువతకు తీవ్ర నిరాశే మిగిలింది. 2025 మార్చిలో బిసి, కాపు కార్పొరేషన్ రుణాలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో బిసి కార్పొరేషన్ కింద 3,600 యూనిట్లు, కాపు కార్పొరేషన్ కింద 1,387 యూనిట్లు, ఇడబ్ల్యుఎస్ కోటా కింద 215 యూనిట్లు మంజూరుకు ఆదేశాలు జారీ అయ్యాయి. మార్చి పదో తేదీ నుంచి 20వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ సైతం జరిగింది. ఏలూరు జిల్లాలో 20 వేలకుపైగా, పశ్చిమగోదావరి జిల్లాలో 20 వేలు మొత్తం 40 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. దరఖాస్తుదారులకు మండల పరిషత్ అధికారులు ఇంటర్వ్యూలు సైతం నిర్వహించారు. దీంతో ఇక కార్పొరేషన్ రుణం వచ్చేసినట్లేనని అంతా భావించారు. అదే సమయంలో ఎస్‌సి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. మే పదో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రారంభించారు. రెండు వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. తర్వాత ఏం జరిగిందో, ఏమో తెలీదుగాని ఒక్కసారిగా కార్పొరేషన్ రుణాల ప్రక్రియను అర్థాంతరంగా నిలిపివేశారు. ఎందుకు నిలిపివేశారో కారణాలు సైతం చెప్పలేదు. మరో మూడు నెలలు గడిస్తే దరఖాస్తుల స్వీకరణ జరిగి ఏడాది గడిచిపోతుంది. ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందనా లేకుండాపోయింది. దీంతో కూటమి ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలు ఇస్తుందా, లేదా అనే చర్చ జనాల్లో సాగుతోంది.

వైసిపి ఏం చేసిందో.. కూటమి అదే చేస్తోందా..!

గత వైసిపి పాలనలో ఎస్‌సి, బిసి, కాపు కార్పొరేషన్ రుణాలను పూర్తిగా పక్కన పెట్టేసింది. ఎస్‌సిలు, బిసిలకు ఇచ్చిన పెన్షన్లు, అమ్మఒడి ఇతర పథకాల సొమ్ము లెక్క చెప్పి ఆయా సామాజిక తరగతులకు పెద్దఎత్తున మేలు చేశామని మసిపూసి మారేడుకాయ చేసే ప్రయత్నం చేసింది. కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని ఆయా సామాజిక తరగతుల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైనా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. దీన్ని అవకాశంగా తీసుకున్న అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి వస్తే కార్పొరేషన్ రుణాలు పెద్దఎత్తున ఇస్తామని హామీ ఇచ్చారు. అనుకున్నట్లుగానే ప్రభుత్వం వచ్చిన కొద్ది నెలలకే కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు ఆహ్వానించడంతో అంతా సంతోషం వ్యక్తం చేశారు. మధ్యలో ప్రక్రియను నిలిపివేసి వైసిపి ఏవిధంగా కార్పొరేషన్ రుణాలకు ఎగనామం పెట్టిందో.. కూటమి సర్కార్ అదేవిధంగా ముందుకు సాగుతోంది. ఎస్‌సి, బిసి కార్పొరేషన్ రుణాల ప్రక్రియను ప్రారంభించి వెంటనే రుణాలు మంజూరు చేయాలని ఆయా సామాజిక తరగతుల నుంచి డిమాండ్ వినిపిస్తోంది. వైసిపి తరహాలో మోసగించాలని చూస్తే వైసిపికి పట్టిన గతే 2029 ఎన్నికల్లో కూటమి సర్కార్‌కు తప్పదని హెచ్చరిస్తున్నారు. కార్పొరేషన్ రుణాలు మంజూరైతే ఎంతోమందికి ఉపాధి దొరుకుతుంది. 20 లక్షల ఉద్యోగాలిస్తామని ఊదరగొడుతున్న ప్రభుత్వం కార్పొరేషన్ రుణాలను ఎందుకు నిలిపివేసిందో సమాధానం చెప్పాలని అంతా కోరుతున్నారు.

జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

నూతన సంవత్సరం సందర్భంగా గురువారం కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమ శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మను జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆయన కార్యాలయంలో కలుసుకొని పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ జిల్లా కలెక్టర్‌కు శాలువా కప్పి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని, ఇంకా అవసరమైన చర్యలు చేపట్టి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. దీనికి తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వెల్లడించారు.

కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం : జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, అనధికారులకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. గురువారం కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సరం సందర్భంగా జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, సిబ్బంది, అనధికారులు కలెక్టర్ చదలవాడ నాగరాణిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా వచ్చిన వారందరికీ కలెక్టర్ చదలవాడ నాగరాణి నూతన సంవత్సరం, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ నూతన సంవత్సరం వేళ అందరి కుటుంబాల్లో సంతోషాలు వెల్లి విరియాలన్నారు. పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని తెలిపారు. నూతన సంవత్సరం వేళ విద్యార్థులు బాగా చదువుకుని జరగబోయే పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తోందని, వాటిని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోని మంచి భవిష్యత్ పొందాలని తెలిపారు.

కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌పి

నిర్ణీత గడువులోగా గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

అలసత్వం వహించిన గుత్తేదారునిపై కేసు నమోదు - కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

ఆప్షన్ త్రీ ప్రభుత్వ గృహ నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, దీనిలో అలసత్వం వహించిన అజాయ వెంచర్స్ ఎల్ఎల్‌పి గుత్తేదారుపై పోలీస్ కేసు నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. ఉగాది నాటికి పిఎంఎవై 1.0 కింద 11,846 ఇళ్ల నిర్మాణాల లక్ష్యాన్ని నూరు శాతం పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ నాగరాణి ఆప్షన్ - 3 ఇళ్ల నిర్మాణాలపై సంబంధిత గుత్తేదారులతో, పిఎంఇవై 1.0 ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలపై గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమీక్షించారు. పిఎంఎవై 1.0 ఆప్షన్ -3 ఇళ్ల నిర్మాణంలో అజాయ వెంచర్స్ ఎల్ఎల్‌పి వారు 2025 డిసెంబర్ నాటికి 1,780 ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉండగా కేవలం 7 ఇళ్లను మాత్రమే పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇళ్ల నిర్మాణాన్ని నిర్ణీత లక్ష్యంలో పూర్తి చేయకుండా పూర్తి అలసత్వం వహించిన అజాయ వెంచర్స్ గుత్తేదారునికి ఇళ్ల నిర్మాణాలకు మ్యాప్ చేసిన డివిజన్‌లో పోలీస్ కేసులను నమోదు చేయడం జరిగిందని వెల్లడించారు. అలసత్వం వహించే వారు ఎవరైనా సరే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆప్షన్ త్రీ కింద 6,271 నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉండగా ఇప్పటివరకూ 1,191 ఇళ్లను మాత్రమే పూర్తి చేయడం జరిగిందని, ఇంకా 5,080 పూర్తి చేయాల్సి ఉందని తెలిపారు. పూర్తి చేయని పక్షంలో చర్యలకు వెనుకాడేదేలేదన్నారు. మిగతా గుత్తేదారులు కూడా ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేసి అప్పగించాలన్నారు. పిఎంఎవై 1.0లో వివిధ కేటగిరీల కింద జిల్లా మొత్తం 56,210 నిర్మాణాలు మంజూరు కాగా ఇప్పటివరకు 36,052 గృహ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించడం జరిగిందన్నారు. ఉగాది నాటికి ఎట్టి పరిస్థితుల్లో 11,846 నిర్మాణాల లక్ష్యాన్ని నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జి.పిచ్చయ్య, ఇళ్ల నిర్మాణాల గుత్తేదారులు, వారి ప్రతినిధులు, గృహ నిర్మాణ శాఖ డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

పోరాటాలతోనే బుద్ధి చెప్పాలి : సిఐటియు

ప్రజాశక్తి - తణుకు

అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ప్రజల సమస్యలను పరిష్కారం చేయనప్పుడు పోరాటాలు ద్వారానే బుద్ధి చెప్పాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ అన్నారు. గురువారం నూతన సంవత్సరం సందర్భంగా సిఐటియు ప్రచురించిన గ్రీటింగ్స్ పట్టణంలోని వివిధ పరిశ్రమల వద్ద పంపిణీ చేసి కార్మికులకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ప్రతాప్, మండలం కన్వీనర్ గుబ్బల గోపి మాట్లాడుతూ కార్మికులు అంటే పాలకులకు చాలా చిన్న చూపు ఉందన్నారు. కార్మికులకు మెరుగైన హక్కులు కల్పించాలని, ఉన్నవి తొలగించడం ఏంటో అర్థం కావడం లేదని తెలిపారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ వారిని పర్మినెంట్ చేయాలని తెలిపారు. కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్స్ రద్దు కోసం ఉద్యమిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఓట్లేసిన కార్మికులకు అన్యాయం చేసి, కార్పొరేట్లకు దాసోహం కావడంపై ప్రజలు ఆలోచించాలన్నారు. పోరాటాలు ఊరికే రావని పాలక విధానాల వల్ల మాత్రమే వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఆదినారాయణ బాబు, నాగేంద్రకుమార్, వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కార్మికులకు గ్రీటింగ్స్ పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపిన ప్రతాప్



క్యాలెండర్, డైరీలను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ నాగరాణి

అధికారుల సంఘం క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలోని జిల్లా కలెక్టర్ బంగ్లాలో పశ్చిమగోదావరి జిల్లా పంచాయితీ అభివృద్ధి అధికారుల సంఘం క్యాలెండర్, డైరీలను జిల్లా కలెక్టర్ నాగరాణి గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామ పంచాయితీ అధికారి రామనాథ్ రెడ్డి, పంచాయితీ అభివృద్ధి అధికారుల సంఘం అధ్యక్షులు పాల శ్రీనివాస్, జిల్లా ట్రెజరర్ సుంకర వెంకటేష్, సహాయ కార్యదర్శి జెవిటి నాయుడు, సహాయ కార్యదర్శి కె.సునీత, సంయుక్త కార్యదర్శి ఎం.ప్రవీణ్ కుమార్, మండల అధికారులు, పంచాయితీ అభివృద్ధి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డెస్క్ ఇన్‌ఛార్జి ప్రసాద్‌కు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బుధవారం అర్ధరాత్రి పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం వద్ద అతివేగంతో మోటార్ సైక్లిస్టు ఢీకొట్టడంతో ప్రజాశక్తి డెస్క్ ఇన్‌ఛార్జి వేండ్ర ప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరులో ప్రజాశక్తి కార్యాలయంలో డెస్క్ ఇన్‌ఛార్జిగా వేండ్ర ప్రసాద్ పనిచేస్తున్నారు. బుధవారం రాత్రి కార్యాలయంలో విధులు ముగించుకుని కొత్త ఏడాది నేపథ్యంలో తాడేపల్లిగూడెం నుంచి పిప్పర మీదుగా స్కూటీపై సొంత గ్రామం పోలమూరు వెళ్తున్నారు. పెనుమంట్ర తహశీల్దార్ కార్యాలయం సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న పెనుమంట్రకు చెందిన మోటార్ సైక్లిస్టు జి.వెంకటేష్ వేగంగా ఢీకొట్టాడు. ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనంలో ప్రసాద్‌ను, అలాగే స్వల్పంగా గాయపడిన వెంకటేష్‌ను తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసాద్‌కు చేతికి, కాలికి, నుదుటిపై, కంటి కింద బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం నిమిత్తం కుటుంబ సభ్యులు తణుకులోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్చారు. వైద్యులు పరిశీలించి కుడి చేతి, కాలి బొటవేలి ఎముకలు విరిగినట్లు గుర్తించి సర్జరీ చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాద వార్త తెలిసిన వెంటనే సిపిఎం కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్, ప్రతాప్ ఆసుపత్రికి చేరుకుని నిరంతరం వైద్యులతో మాట్లాడుతూ పరిస్థితిని పర్యవేక్షించారు. గాయాలైన డెస్కు ఇన్‌ఛార్జి ప్రసాద్‌ను రాజమండ్రి ఎడిషన్ మేనేజర్ డి.శ్రీనివాస్, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల మేనేజర్ పి.నారాయణరాజు, అకౌంటెంట్ నాగభూషణం పరామర్శించారు. సిజిఎం అచ్యుతరావు, ఎడిటర్ తులసీదాస్, జిఎంలు తిరుపాలరెడ్డి, తోడర మల్లు ఫోన్లో మాట్లాడి ఆయన యోగక్షేమాలు తెలుసుకున్నారు.

రేషన్ కార్డుదారులకు గోధుమపిండి పంపిణీ

ప్రారంభించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న రేషన్ దుకాణాల ద్వారా గోధుమపిండి విక్రయాన్ని భీమవరంలో కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, కలెక్టర్ చదలవాడ నాగరాణి, జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించి లబ్ధిదారులకు గోధుమపిండి ప్యాకెట్లు అందజేశారు. 49 రేషన్ దుకాణాల పరిధిలోని 33,363 మంది కార్డుదారులకు ఈ నెలలో బియ్యం, పంచదారతోపాటు నాణ్యమైన గోధుమ పిండి అందజేయనున్నట్లు తెలిపారు. జెసి రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జనవరి నుంచి ప్రయోగాత్మకంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నాణ్యమైన గోధుమపిండిని కేజీ 20 రూపాయలకే అందించాలని భావించిందన్నారు. భీమవరం పట్టణంలోని 33 వేల మంది కార్డుదారులు నాణ్యమైన గోధుమపిండిని పొందాలని కోరారు. జిల్లా సివిల్ సప్లై అధికారి సరోజ, లబ్ధిదారులు పాల్గొన్నారు.


రేషన్ కార్డుదారులకు గోధుమపిండిని అందజేస్తున్న కేంద్రమంత్రి, కలెక్టర్

మహిళల మానసిక వికాసానికి ఐద్వా కృషి

జిల్లా అధ్యక్షురాలు సందక ఉదయ కుమారి

ప్రజాశక్తి - ఆకివీడు

మహిళల మానసిక వికాసానికి ఐద్వా కృషి చేస్తుందని ప్రజాతంత్ర మహిళా సమాఖ్య(ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు సందక ఉదయ కుమారి అన్నారు. గురువారం సాయంకాలం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘ పట్టణ అధ్యక్షురాలు డోకల లక్ష్మీ అధ్యక్షతన కమిటీ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉదయ కుమారి పాల్గొని మాట్లాడారు. పట్టణంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించబోయే ఆటలు, పాటలు, ముగ్గుల పోటీల గురించి చర్చించారు. పట్టణంలోని ఒక కేంద్రంలో పట్టణ స్థాయిలోనూ, ఎనిమిది వార్డుల్లో వార్డు స్థాయిలోనూ ఈ పోటీలు నిర్వహిస్తామని ఉదయ కుమారి వివరించారు. ఈ పోటీలో మ్యూజికల్ చైర్స్, ముగ్గుల పోటీలు మరిన్ని ఆటలు పోటీలు నిర్వహిస్తామని ఆమె చెప్పారు. అనంతరం ఐద్వా జిల్లా స్థాయిలో ప్రచురించిన క్యా లెండర్‌ను స హసభ్యులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు దొడ్డి పద్మ, అర్జి లక్ష్మి, వి.సత్యవతి, జి. లావణ్య, జయలక్ష్మి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఐద్వా నేతలు

అవయవదాన పోస్టర్ ఆవిష్కరణ

పిఎంపి వైద్యుల సేవలు అమోఘం

డిఎంహెచ్ఒ జి.గీతాబాయి

ప్రజాశక్తి - గణపవరం

మండలంలోని పిఎంపి డాక్టర్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా డిఎంహెచ్ఒ జి.గీతాభాయి జీవదాన్ కేన్సర్ అవయవ దాన పోస్టర్లను గురువారం భీమవరంలోని తన కార్యాలయంలో ఆవిష్కరించినట్లు పిఎంపి అసోషియేషన్ జిల్లా అధ్యక్షులు ఎఆర్‌కె.పరమేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా గీతాభాయి మాట్లాడుతూ గ్రామాల్లో పిఎంపి వైద్యులు ప్రజలకి అందిస్తున్న సేవలు అమోఘమని అన్నారు. అసోషియేషన్ ఆధ్వర్యాన మరిన్ని సేవలందించాలని తెలిపారు. గీతాభాయిని కలిసిన వారిలో ప్రధాన కార్యదర్శి ఎస్.సుభాష్, మండల సభ్యులు ఎన్.రంగా ప్రసాద్ ఉన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ గీతాభాయి

ఎపిఎంఎఫ్ గణిత క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - భీమవరం

స్థానిక కలెక్టరేట్లో ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరమ్ ఆధ్వర్యాన తయారుచేసిన గణిత క్యాలెండర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఇవివిఎన్ఎస్ఎస్ఎస్‌బిఎల్.నారాయణ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో చిన్నప్పటి నుండి గణితం పట్ల అభిరుచిని పెంపొందించాలని, నిజ జీవితంలో గణితం ప్రాముఖ్యతను విద్యార్థులకు చిన్నప్పటి నుంచి తెలియచేయాలని సూచించారు. ఎపిఎంఎఫ్ జిల్లా సభ్యులు రేపాక వెంకన్న బాబు మాట్లాడుతూ ఈ క్యాలెండర్లో ప్రతి పేజీలో గణిత శాస్త్రజ్ఞులైన డిఆర్ కాప్రేకర్, ఎస్ఆర్.శ్రీనివాస వర్ధన్, శ్రీభారతీయ కృష్ణ తీర్థ, హ్యూమన్ కంప్యూటర్ శకుంతలాదేవి, నీనా గుప్త, పిసి.మహలనోబిస్, సిఎస్.శేషాద్రి, రామన్ పరిమల, ప్రపంచ ప్రఖ్యాత సాంఖ్యక శాస్త్రవేత్త ప్రొఫెసర్ సిఆర్.రావు, హరీష్ చంద్ర మెహ్రోత్ర, గణిత అవధాని లక్కోజు సంజీవరాయ శర్మ, గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌లకు చెందిన ముఖ్యమైన విషయాలు ప్రతి పేజీలో ఇవ్వబడిన క్యూఆర్ కోడ్ ద్వారా వారి జీవిత విశేషాలను తెలుసుకోవచ్చన్నారు. క్యాలెండర్‌లో వచ్చే వివిధ తేదీలను గణితపరంగా వివిధ రకాలుగా సూచించడమైనదన్నారు. ఈ క్యాలెండర్లను జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాలకు ఎపిఎంఎఫ్ ద్వారా అందజేస్తామని తెలియజేశారు. ఎపిఎంఎఫ్ రాష్ట్ర టెక్నికల్ కమిటీ మెంబర్ సయ్యద్ షమీంషా, ప్రధానోపాధ్యాయులు ఎన్ఎస్ఎస్.భగవాన్ రాజు, గణిత ఉపాధ్యాయులు మడిపల్లి శ్రీనివాసరావు, సిహెచ్ఎల్‌విఎస్.చలం, అల్లు ప్రసాద్, కె.రాజేష్ కుమార్ రాజు, బిఎంఎన్.కుమార్, ఎస్.ప్రేమ రాజు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డిఇఒ నారాయణ

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

శక్తి టీమ్ ఇన్‌ఛార్జి ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి

ప్రజాశక్తి - నరసాపురం

మైనర్లు వాహనాలు నడిపితే కఠిన చర్యలు, జైలు శిక్ష, భారీ జరిమానాలు విధిస్తామని నరసాపురం సబ్ డివిజన్ శక్తి టీమ్ ఇన్‌ఛార్జి ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి హెచ్చరించారు. నరసాపురం డిఎస్‌పి డాక్టర్ జి.శ్రీవేద ఆధ్వర్యాన గురువారం టౌన్ ఎస్ఐ జయలక్ష్మి, శక్తి టీమ్ సిబ్బంది పలు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. మొదటిసారి పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. మరోసారి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు. యువత ఒక లక్ష్యాన్ని ఎంచుకుని దాన్ని సాధించే దిశగా కృషిచేయాలన్నారు. ర్యాగింగ్, చెడు వ్యవసనాలు, సోషల్ మీడియా, మత్తు పదార్థాలు, ఈవ్ టీజింగ్‌కు దూరంగా ఉండాలన్నారు. బైక్ నడిపే ప్రతి ఒక్కరూ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు.

యువతతో మాట్లాడుతున్న ఎస్ఐ


ఎంఎల్‌సి గోపీమూర్తికి బొకే అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎంఎల్‌సి గోపీమూర్తిని కలిసిన నేతలు

ప్రజాశక్తి - మొగల్తూరు

పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తిని యుటిఎఫ్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. భీమవరంలోని గోపీమూర్తి కార్యాలయంలో గురువారం మొగల్తూరు గ్రామానికి చెందిన యుటిఎఫ్ సంఘం సంఘం జిల్లా డైరెక్టర్ చింతపల్లి కృష్ణమోహన్, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కొల్లాటి బ్రహ్మయ్య, పలువురు సంఘ నాయకులు గోపీమూర్తిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

దుస్తులు అందజేస్తున్న నాగరాజు

వృద్ధులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - పెనుగొండ

మాల మహానాడు అధ్యక్షుడు రావి నాగరాజు పుట్టినరోజు సందర్భంగా గురువారం పెనుగొండలో ఉన్న శ్రీవాణి వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. నాగరాజు ఏర్పాటు చేసిన భోజనాలు చీరలు, షర్ట్‌లు, టీ షర్టులు, ఫ్రూట్స్‌ను వృద్ధులకు అందించారు. మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు సరెళ్ల శ్రీనివాస్ చేతుల మీదుగా వృద్ధులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంతగాని నాగేశ్వరావు, మట్టా చంటి పాల్గొన్నారు.

యువతకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - నరసాపురం

విద్యా సంస్థలు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్ టీజింగ్‌కు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని నరసాపురం ఎస్ఐ సిహెచ్.జయలక్ష్మి హెచ్చరించారు. బుధవారం నరసాపురం పట్టణంలోని కళాశాల వద్ద చక్కర్లు కొడుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యా సంస్థలు, బస్టాండ్, రద్దీగా ఉండే ప్రాంతాల్లో నిఘాను ముమ్మరం చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు టిడిపి గ్రీవెన్స్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం టిడిపి కార్యాలయంలో ఈనెల 2వ తేదీ శుక్రవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(గ్రీవెన్స్) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు వెల్లడించారు. ఉదయం 9 గంటల నుంచి ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేయవచ్చని తెలిపారు. సమస్యల తక్షణ పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని, నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఇంటి ఆవరణలో వేసిన రంగురంగుల ముగ్గులు

గ్రామాల్లో రంగవల్లుల సందడి

ప్రజాశక్తి - పెనుగొండ

మండలంలోని గ్రామాల్లో మహిళల రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామాల్లోని వీధులు, ప్రతి ఇంటి ముందు అందమైన రంగురంగుల ముగ్గులతో ముస్తాబయ్యాయి. అర్ధరాత్రి వరకు మహిళలు ఇంటి ముందే కాకుండా గ్రామ వీధులు, కూడళ్లు, దేవాలయాల పరిసరాల్లో రకరకాల ఆకృతులు, పూల నమూనాలతో ముగ్గులు వేసి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ముగ్గుల కళతో గ్రామాలు మరింత శోభాయమానంగా మారాయి.

నేడు ఎరువు, పురుగు మందుల డీలర్లకు శిక్షణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడానికి రైతుల సంక్షేమానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని తాడేపల్లిగూడెం సహాయ వ్యవసాయ సంచాలకులు ఆర్.గంగాధర్‌రావు తెలిపారు. రైతులకు అందించే విత్తనాలు, పురుగు మందులు, వాటి నాణ్యత, సంబంధిత చట్టాలపై డీలర్లకు అవగాహన కల్పించేందుకు గురువారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ బిల్డింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఏడిఎ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బయో ఫెర్టిలైజర్స్, బయో పెస్టిసైడ్స్, ఇతర ఎరువులకు సంబంధించిన ఉత్పత్తులపై, వాటి నియమ నిబంధనలపై డీలర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. లేనియెడల వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు తీసుకునే చర్యలకు బాధ్యులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రిటైల్ డీలర్లు, సొసైటీ సిఇఒలు, సొసైటీ సేల్స్ మెన్‌లు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు.

మొగల్తూరులో అన్న సమారాధన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండల కేంద్రం మొగల్తూరులోని కోట రోడ్డులో ఉన్న దత్త సాయి మందిరంలో గురువారం అన్న సమారాధనను ఘనంగా నిర్వహించారు. దత్త సాయి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన అన్న సమారాధనలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు శెట్టి మోహనరావు పర్యవేక్షణలో పలువురు సభ్యులు సమారాధనలో పాల్గొన్న ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పెదగోపురం ఐకుకు అభినందన

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎపి ఎన్‌జిఒ సంఘం, పాలకొల్లు తాలూకా పాలకొల్లు, పోడూరు, ఆచంట మండలాల్లో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగుల సంఘంకు జరిగిన ఎన్నికల్లో ముచ్చర్ల శ్రీనివాసరావు ఐఐ. ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా ఆయనను సిబ్బంది అభినందించారు. స్వామి వారి ఆలయ సిబ్బంది, అర్చకులు శేషాచార్యులు అభినందనలు తెలిపారు. ఆలయ పాలక మండలి ఛైర్మన్ మీసాల రామచంద్రరావు పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

నలుగురు పందెం రాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - మొగల్తూరు

కోడిపందేల స్థావరంపై బుధవారం రాత్రి దాడి చేశామని ఎస్ఐ జి.వాసు తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమకు అందిన సమాచారం మేరకు మొగల్తూరు పోలీస్ స్టేషన్ పరిధి ముత్యాలపల్లి శివారు వారి పాలెం లో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో నలుగురు పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ.1,050 నగదు, నాలుగు పందెం కోళ్లు, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. వారిని గురువారం కోర్టులో హాజరు పరిచామని తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ప్రమాదాల నిలయంగా చినకాపవరం రహదారి

రోడ్డుపై నిలిచిపోతున్న పంట కాలువల నీరు
బురదలో జారిపడి ప్రమాదాలబారిన వాహనదారులు
అధికారులు స్పందించాలని గ్రామస్తుల వేడుకోలు

ప్రజాశక్తి - ఆకివీడు

గోతులు, గొప్పులు, ఎత్తు పల్లాలతో ప్రమాదాలకు నిలయంగా తయారైంది చినకాపవరం-రామయ్యగూడెం రోడ్డు. ఈ రోడ్డు పంటచేలకన్నా పల్లంగా ఉండడంతో రోడ్డు పక్కన ఉన్న పంట కాలువలు పొంగితే ఆ నీరు రోడ్డు మీదకు వచ్చి నిలిచిపోతూ ఉంటాయి. వానాకాలాన్ని మరిపిస్తూ ఉంటాయి. రోడ్లు మొత్తం పక్కనున్న పంటకాల్వలో ఎత్తు కన్నా బలంగా ఉండడంతో ఈ దుస్థితి ఏర్పడుతోందని రామయ్య గూడెం వాసులు ఎన్నోసార్లు అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా ఏ ఒక్కరూ ఈ రోడ్డు గురించి పట్టించుకోవటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. కొల్లేటికి వెళ్లే ఈ రోడ్డులో ఈ గ్రామం చిట్టచివరి గ్రామం. ఈ మార్గంగా ప్రతిరోజు వందలాది మంది రైతులు చెరువులకు, పొలాలకు వెళుతూ ఉంటారు. ఈ గ్రామాన్ని అధికారులు గానీ, అటు ప్రజాప్రతినిధులు గాని ఏ ఒక్కరూ పట్టించుకోవటం లేదని ఆ గ్రామస్తులు తమ ఆవేదన వెలిబుచ్చుతున్నారు. శీతాకాలంలో కూడా బురదలో జారిపడి సైకిళ్లు, మోటార్ సైకిళ్లు ప్రమాదాలకు గురవుతున్నాయి. గురువారం సాయంకాలం ఒక సైకిలిస్ట్ ఆ బురదలో పడిపోవడంతో తన బాధను వెలిబుచ్చాడు. వెంటనే అధికారులు ఎప్పటికైనా తమ గోడును వినిపించుకుని రోడ్డు ఎత్తు పెంచి, గోతులు పూడ్చాలని కోరుతున్నారు.

అధ్వానంగా చినకాపవరం శివారు రామయ్య గూడెం వద్ద రోడ్డు

కేంద్రమంత్రిని సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

కేంద్ర మంత్రికి సత్కారం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరంలోని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ క్యాంపు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు కేంద్రమంత్రి శ్రీనివాస వర్మను కలసి శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సత్కరించారు. ఈ వేడుకల్లో భాగంగా తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ, ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శివ నారాయణ రెడ్డిలు, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, ఎపి భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డ్ ఛైర్మన్ వలవల బాబ్జి, బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి కేంద్రమంత్రి శ్రీనివాస వర్మకి పూల బొకేలు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. వీరితోపాటు జిల్లాలోని పలువురు ఆర్‌డిఒలు, డిఎస్‌పిలు, సిఐలు, తహశీల్దార్లు, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శులు కలిదిండి వినోద్ వర్మ, తోట గంగరాజు, టిడిపి, జనసేన, బిజెపి కూటమికి చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానానికి శ్రీదేవి ట్రస్ట్ సాయం

ప్రజాశక్తి - కాళ్ల

ప్రార్థన మందిరాల్లో జరిగే అన్న సమారాధనకు దాట్ల శ్రీదేవి ట్రస్టు అధినేత డాక్టర్ దాట్ల వెంకట రామరాజు సాయం అందించేందుకు ముందుకు వచ్చారు. కాళ్లకూరు గ్రామంలో క్రిస్టియన్ పేటలో ఉన్న సిబిసిఎన్‌సి రెండు ప్రార్థన మందిరాలకు నూతన సంవత్సర వేడుకల అన్న సమారాధన నిమిత్తం దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు ముందుకు వచ్చారు. ఒక్కో ప్రార్థన మందిరానికి రూ.30 వేలు విలువైన కిరాణా సరుకులు గురువారం అందించారు. ట్రస్ట్ సభ్యులు పెన్మెత్స నాగరాజు చేతుల మీదుగా అందజేశారు. ఈ అన్న సమారాధనకు 1400 లీటర్ల ఆర్వో వాటర్‌ను అందించారు.

నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు నాగరాజు

నిత్యావసర సరుకులు అందజేత

నిత్యావసరాలు అందజేస్తున్న లయన్స్ సభ్యులు

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన నూతన సంవత్సరం పురస్కరించుకుని రాయకుదురులోని పేదలకు గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పోలిశెట్టి సత్యనారాయణ(దాసు) ఆధ్వర్యాన వారు కుమారుడు, కోడలు లయన్స్ వెంకటరామకృష్ణ, ప్రసన్నలు ఆర్థిక సహకారంతో కొంత మంది నిరుపేదలకు ఐదు కేజీల చొప్పున బియ్యం, దుప్పట్లు, పళ్లు, బిర్యానీ అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు దేవిరెడ్డి పుల్లారావు, పోలిశెట్టి శ్రీనివాస్, పులిపాకల శ్రీనివాస్, పంజా వెంకటేశ్వరావు, ధూళిపాల శ్రీనివాసు, చల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

ప్రజాశక్తి - కాళ్ల

వైసిపి కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని ఉండి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహ రాజు పిలునిచ్చారు. పెదఅమిరం గ్రామంలోని వైసిపి జిల్లా కార్యాలయం వద్ద వైసిపి ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు నూతన సంవత్సర వేడుకలను ఘనంగా గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి తర్వాత బస్సు యాత్ర ఉంటుంది, ఆ తర్వాత పాదయాత్ర చేస్తానని జగన్మోహన్ రెడ్డి చెప్పడం జరిగిందన్నారు. టిడిపి మోసాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకివీడు నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి శ్రీనివాస్, జెడ్‌పిటిసిలు యండగండి శ్రీను, రణస్థల కనకదుర్గ మహంకాళి, ఎంపిపిలు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కటారి జయలక్ష్మి కేశవ, ఆకివీడు, ఉండి, కాళ్ల, పాలకోడేరు మండల అధ్యక్షులు అంబటి రమేష్, నంద్యాల లక్ష్మి సీతారామయ్య, పివిఆర్‌కె ఆంజనేయరాజు, గణేష్ రాంబాబు, చల్లబోయిన పాపారావు, రాష్ట్ర నాయకులు మంతెన వెంకట సునీల్ వర్మ, వేగేశ్న జయరామకృష్ణంరాజు, సాగిరాజు హరివర్మ, పెనుమత్స రంగరాజు పాల్గొన్నారు.

కూటమి నేతల సందడి..

టిడిపి కార్యాలయాల వద్ద, అధికారుల ఇళ్ల వద్ద గురువారం నూతన సంవత్సర వేడుకల సందడి నెలకొంది. డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజును గజమాలతో ఘనంగా సన్మానించి, పూలబొకెలను అందజేశారు. అదేవిధంగా వచ్చిన వారందరికీ నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలను తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ల వద్ద కింది ఉద్యోగులు, అధికారులకు శుభాకాంక్షలు తెలపడంతో మండలంలో సందడి నెలకొంది. ఇదిలా ఉండగా మాంసాహార రెస్టారెంట్లలో అమ్మకాలు బాగున్నాయని తెలిపింది. ప్రత్యేక స్టాల్స్ పెట్టడంతో అమ్మకాలు పెరిగాయని చెబుతున్నారు. 2026 నూతన సంవత్సర వేడుకలు ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా రాజకీయనాయకుల ఇళ్లు కార్యకర్తలు, అధికారులు అభిమానులతో సందడిగా మారాయి. పెద్ద ఎత్తున తరలివచ్చి ఎపిఐసిసి ఛైర్మన్, ఉండి మాజీ ఎంఎల్ఎ మంతెన రామరాజుకు శుభాకాంక్షలు చెప్పారు. కార్యకర్తలకు విందు ఏర్పాటు చేశారు. జనసేన, టిడిపి నాయకులు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కాళ్ల, కాళ్లకూరు, కోపల్లె, కలవపూడి సహకార సంఘాల వద్ద రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు సందడి చేశాడు. సొసైటీ అధ్యక్షులు ఎరుబండి రామాంజనేయులు, నంద్యాల రామరాజు, దండు ప్రణవ మూర్తిరాజు, మంతెన చిన నరసింహరాజులు శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ సోదరులు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాత్రి నుండి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆర్‌సిఎం, సిబిసిఎన్‌సి, సిఎస్ ఐ, లూథరన్ ప్రార్థన మందిరాల ఆధ్వర్యాన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి నూతన సంవత్సరం ఘనంగా జరుపుకున్నారు.

తాడేపల్లిగూడెం : కొత్త సంవత్సరంలో, సరికొత్త ఆలోచనలతో అభివృద్ధిని సాధిద్దామని విప్, ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు యువ నాయకులు బొలిశెట్టి రాజేష్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తాడేపల్లిగూడెం నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ల సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి కృషి చేస్తున్నామని అన్నారు. అనంతరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఈతకోట తాతాజీ, తోట రాజా, వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడపా ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, వీర మహిళలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసిపి రైతు విభాగం(ఆక్వాకల్చర్) వర్కింగ్ ప్రెసిడెంట్ వడ్డి రఘురామ్ నాయుడు నివాసంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. అభిమానులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చి వడ్డి రఘురామ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుతగా రాష్ట్ర ప్రజలకు, రైతులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గత వైసిపి ప్రభుత్వంలో ప్రజలు, రైతులు సుభిక్షంగా వర్ధిల్లారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో కష్టాలు పడుతున్నారన్నారు. మళ్లీ వచ్చేది వైసిపి ప్రభుత్వమేనని వడ్డి రఘురామ్ ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాళ్లలో..

నరసాపురం : నాయకర్ పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

మాజీ ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆధ్వర్యాన వైసిపి క్యాంప్ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 18 నెలలు కావస్తున్న ప్రజలకు చేసింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు : పాలకొల్లులో కొత్త సంవత్సరం సందర్భంగా వైసిపి నేతల ఇండ్ల వద్ద హడావిడి ఎక్కువగా ఉంది. టిడిపి నేతలు ఇండ్ల వద్ద అంతంత మాత్రంగానే హడావిడి ఉంది. పాలకొల్లు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి గుడాల గోపి కార్యాలయం వద్ద పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షులు కర్రా జయ సరిత ఉన్నారు. మాజీ ఇన్‌ఛార్జి గుణ్ణం నాగబాబు కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి కార్యకర్తలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ కార్యాలయం వద్ద కూడా పలు గ్రామాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తాతాజీకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి నిమ్మల పట్టణంలో ఉండకపోవడం, మాజీ ఎంఎల్‌సి అంగర గుడికి వెళ్లడంతో టిడిపి నేతల ఇళ్ల వద్ద సందడి తక్కువగా ఉంది.

నరసాపురం : తీరంలో న్యూ ఇయర్ వేడుకల్ని ప్రజలు గురువారం ఘనంగా జరుపుకున్నారు. బంధువులు, స్నేహితులకు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పారు. ఇటు అధికారుల కార్యాలయాలు, నేతల ఇళ్ల వద్ద ఉదయం నుంచి సందడి నెలకొంది. ఆర్‌డిఒ, డిఎస్‌పి, ఇరిగేషన్, వ్యవసాయ, తహశీల్దార్, ట్రాన్స్ కో, మున్సిపల్ తదితర అధికారులకు శుభాకాంక్షలు తెలిపేందుకు సిబ్బంది తరలివచ్చారు. ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్, మాజీ ఎంఎల్ఎ బండారు మాధవనాయుడు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, మత్స్యకార కార్పొరేషన్ ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, టిడిపి అర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి కొవ్వలి నాయుడు, వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, డిసిఎంఎస్ చాగంటి మురళీకృష్ణ, జనసేన నాయకుడు పోలిశెట్టి శ్రీనివాస్ ఇళ్ల వద్ద సందడి కనిపించింది. నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. మధ్యాహ్నం వరకు ఇదే సందడి కొనసాగింది. ఆలయాలు, చర్చిలు ఉదయం నుంచి భక్తులు, క్రైస్తవ సోదరులతో కిటకిటలాడాయి.

భీమవరం టౌన్ : రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, భీమవరం ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు)కు వేలాది మంది ప్రజలు, అభిమానులు, రాజకీయాలకు అతీతంగా పార్టీ శ్రేణులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. భీమవరం బ్యాంక్ కాలనీలోని వారి స్వగృహంలో ఉదయం నుండి ప్రజలు పెద్ద ఎత్తున భీమవరం నియోజకవర్గం నుండే కాకుండా ఇతర నియోజకవర్గాల నుండి కూడా తరలివచ్చి ఆయనను స్వయంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మధ్యాహ్నం రెండు గంటలు దాటినా కూడా ప్రజలు ఇంకా వస్తుండటంతో ఆయనపై ఉప్పొంగిన ప్రజాభిమానం స్పష్టంగా కనిపించింది. అన్ని శాఖల ఉన్నతాధికారులు, పార్టీ శ్రేణులతోపాటుగా వృద్ధులు సైతం ఎంఎల్ఎ అంజిబాబును నేరుగా కలిసి ఆశీస్సులు అందించారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయిలో చూడాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, తెలుగు మహిళలు, పట్టణ, మండల అధ్యక్షులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, పలు దేవాలయాల ఛైర్మన్లు, పాలకవర్గ సభ్యులు, సొసైటీ బ్యాంక్ ఛైర్మన్లు, డైరెక్టర్లు, ఎంపిటిసిలు, ఎంపిపిలు, సర్పంచ్లు, అధికారులు పాల్గొన్నారు.

తణుకు : తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ కార్యాలయంలో గురువారం న్యూ ఇయర్ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం కార్యాలయ ఆవరణలో అభిమానులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారుల మధ్య కేకు కట్ చేసిన ఆయన వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ రాధాకృష్ణను తణుకు నియోజకవర్గంలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున విచ్చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించి రాబోయే రోజుల్లో ఎంఎల్ఎ రాధాకృష్ణ నేతృత్వంలో నియోజకవర్గంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరంలో ప్రతి కుటుంబాల్లో ఆనందం, సంతోషంతో పాటు వారు కోరుకున్న కోరికలు అన్ని సిద్ధించాలని ఎంఎల్ఎ ఆకాంక్షించారు.

మొగల్తూరు : మండలంలోని గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల కార్యాలయాలు అభిమానులు, కార్యకర్తలు, సిబ్బందితో కిటకిటలాడాయి. గ్రామాల్లో ఉన్న చర్చిల్లో క్రైస్తవ సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆలయాలు యాత్రికులతో సందడి నెలకొన్నాయి. యాత్రికులు ఆలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఒకరికి ఒకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు.


తాడేపల్లిగూడెంలో..


పాలకొల్లులో..

లింకు దస్తావేజులు పడిపోయినవి

మాకు ఆస్తికి సంబంధించి డ్యాకుమెంట్ నెంబర్ 396/2020 ఏలూరు ఆర్వో నందు ది.13-01-2020 నాడు రిజిష్టర్ కాబడి ఉన్నది. సదరు డ్యాకుమెంట్ కు సంబంధించిన ఏలూరు ఆర్వో నందు రిజిష్టర్ కాబడిన ఒరిజినల్ లింకు డ్యాకుమెంట్లు 1824/1999, 5403/2018, 9507/2018, 11505/2018 ది.24-12-2025 తేదిన మా నివాసం నుండి సదరు ఒరిజినల్ లింకు డ్యాకుమెంట్లను తీసుకుని గాలాయగూడెం వెళ్లాను. అక్కడ పని ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా సోమవరప్పాడు వద్దకు వచ్చే సరికి సదరు ఒరిజినల్ డ్యాకుమెంట్లు ఉన్న కవరు కనిపించలేదు. వెనక్కి వెళ్లి చూడగా ఆ కాగితాలు ఉన్న కవరు కనిపించలేదు. కావున ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్‌తో ఉన్న కవరు దొరికిన వారు ఈ కింది అడ్రస్‌కు అందజేయగలరని కోరుతున్నాను.

చెన్నూరి విజయలక్ష్మీ భర్త అట్రగడ్డ శ్రీరామ్,
డోర్ నెం 16-645, హనుమాన్ నగర్,
ఏలూరు సెల్ :- 9704205686.

జయసరితకు అభినందన

పాలకొల్లు : పాలకొల్లు వైసిపి కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుడాల శ్రీహరి గోపాలరావు, టౌన్ ప్రెసిడెంట్ కోరాడ శ్రీను ఆధ్వర్యాన స్టేట్ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి, కాకినాడ జిల్లా మహిళా విభాగం ఇన్‌ఛార్జి కర్రా జయసరిత పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆమె ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

కేక్ కట్ చేస్తున్న జయసరిత

సర్టిఫికెట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం పట్టణం, స్టీమర్ రోడ్, రాజగోపాల స్వామి దేవాలయం, డోర్‌నెం.1-1-9కి చెందిన కొప్పర్తి భాస్కరనారాయణ, S/o కొప్పర్తి క్రిష్ణయ్య, (లేటు) అను నేను 1-12-2025 తేదీన నా ఒరిజినల్ మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్ No.AMC 3389 01-05-12-2020 Valid upto 4-12-2025 నెంబరు గల ఒరిజినల్ సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్‌ను విజయవాడ వెళ్తుండగా నరసాపురం మండలంలో సీతా రామపురంలో ఉన్న శివాలయము దగ్గర నా యొక్క కారులో పెట్టి దేవుని దర్శనము నిమిత్తం వెళ్లి తిరిగి వచ్చిచూడగా సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్ పోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

కొప్పర్తి భాస్కర నారాయణ, S/o కొప్పర్తి క్రిష్ణయ్య (లేటు), డోర్‌నెం.1-1-9, రాజగోపాలస్వామి దేవాలయం, నరసాపురం, ప.గో.జిల్లా.

సర్టిఫికెట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం పట్టణం, స్టీమర్ రోడ్, రాజగోపాలస్వామి దేవాలయం, డోర్‌నెం.1-1-9కి చెందిన కుచిబొట్ల విజయలక్ష్మి, W/o.కొప్పర్తి భాస్కరనారాయణ అను నేను 1-12-2025 తేదీన నా ఒరిజినల్ మెడికల్ కౌన్సిల్ సర్టిఫికెట్ No.AMC 5016 Dt.03-12-2020 Valid upto 2-12-2025 నెంబరు గల ఒరిజినల్ సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్‌ను విజయవాడ వెళ్తుండగా నరసాపురం మండలంలో సీతారామపురంలో ఉన్న శివాలయము దగ్గర నా యొక్క కారులో పెట్టి దేవుని దర్శనము నిమిత్తం వెళ్లి తిరిగి వచ్చిచూడగా సర్టిఫికెట్ ఉన్న బ్యాగ్ పోయినది. దొరికిన వారు ఈ క్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

కుచిబొట్ల విజయలక్ష్మి, W/o కొప్పర్తి భాస్కర నారాయణ, డోర్‌నెం.1-1-9, స్టీమర్ రోడ్, రాజగోపాల స్వామి దేవాలయం, నరసాపురం, ప.గో.జిల్లా.

ఓరిజనల్ డాక్యుమెంట్ పోయినది

ఏలూరు జిల్లా, ముసునూరు మండలం, కాట్రేనిపాడు గ్రామానికి చెందిన అక్కినేని శ్రీనివాసరావు, భార్య అక్కినేని సులోచన కు చెందిన సర్వేనెంబరు. 127/3లో య.0-50 సెంట్లు భూమికి చెందిన 2799-2003 గల ఒరిజినల్ డాక్యుమెంట్ కాట్రేనిపాడు గ్రామంలో ది.20-11-2025 జిరాక్స్ నిమిత్తం వస్తుండగా మార్గమధ్యంలో జారిపోయినది. కావున ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్సుకు అందచేయగలరు లేదా తెలియజేయగలరు.

అక్కినేని సులోచన, భర్త శ్రీనివాసరావు
కాట్రేనిపాడు గ్రామం, ముసునూరు మండలం,
ఫోన్: 8374271744

డాక్యుమెంట్స్ పోయినవి

పాలకొల్లు మండలం ఉల్లంపర్రు, పార్వతి నగర్‌కు చెందిన పితాని మోహన్ రావు, తండ్రి: నాగభూషణరావు తెలియజేయునది ఏమనగా 2020 సంవత్సరంలో పాలకొల్లు నివాసి వెలమ గూడెం కు చెందిన కానూరి శ్రీనివాసరావు కుమారుడు సాయి కుమార్ దగ్గర ఆర్ఎస్ నెంబర్ 210, మున్సిపల్ అసెస్మెంట్ నెంబర్ 1079006246 లో 36.100 చ.గజాలు స్థలం 4.55 లక్షల రూపాయలకు కొనుగోలు చేసి పాలకొల్లు ఎస్ఆర్ఓ లో 19-3-2020 రిజిస్టర్ చేయించుకున్నాము. అగ్రిమెంట్ నెంబర్ 1773/2020లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాము. లింక్ డాక్యుమెంట్ నెంబర్ 2033/2019 ని ది. 12-04-2019న పాలకొల్లు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాము. ది 30-11-2025 న నా ఒరిజినల్ 2 డాక్యుమెంట్స్ తీసుకొని జిరాక్స్ తీయించుకోవడానికి పార్వతి నగర్ నుండి పాలకొల్లు సెంట్రల్‌కు బయలేరేగా అక్కడ నా ఒరిజినల్ డాక్యుమెంట్లు కనిపించలేదు దారిలో ఎంత వెతికినా ఎక్కడా కనిపించలేదు. కాబట్టి ఎవరికైనా దొరికినా పై అడ్రస్‌లో నాకు అందజేయవలసిందిగా కోరి ప్రార్థించుచున్నాను.

సెల్ నెం : 98487 22327

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS, AT ELURU
A.A.C.F. No. 153/2024

Between:-
SRMB KUBHERA CHITS PVT. LTD.
Represented by its Foreman.
Jangareddigudem. ..... Disputant
And
Gubbala Nageswara Rao & Others
.... Opponents

Notice to Opponents 1,2,3 & 4

1. Gubbala Nageswara Rao, W/o. Narasimhamurthy, R/o. D. No. 13-1-4, Opp. Ramalayam, Buttaigudem Road, Jangreddigudem, Eluru District. (Opponent No. 1)
2. Gubbala Chandra, W/o. Gubbala Nageswara Rao, R/o.D.No. 13-1-4, Opp. Ramalayam, Buttaigudem Road, Jangreddigudem, Eluru District. (Opponent No. 2)
3. Jampani Yedukondalu, S/o. Somaraju, R/o. D. No. 4-58,Gowda Bazar, Kamavarapukota Kamavarapukota(M), Eluru District (Opponent No. 3)
4. Dousuri Veerabhadram, S/o. Veeraswamy, R/o. Chinnavarigudem, Ayyavaripolavarm, Eluru District (Opponent No. 4)

Please take notice that the above Claim Petition had filed for recovery of claim amount and the Honorable Deputy Chit Registrar ordered notice to all of you and posted the case to 23-01-2026 for your appearance. So all of you are here by requested to appear before the office of Honorable Deputy Registrar of Chits, District Registrar Office, Eluru on 23-01-2026 at 10-30 A.M. in person or through your Advocate, failing which the matter will be decided in your absence.

(By order of the Honorable Deputy Registrar of Chits)

Hearing Date: 23-01-2026

NVBL Achary, Advocate
Jangareddigudem